ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



స్వర నీరాజనం



- భద్రాద్రిలో ఘనంగా వాగ్గేయకారోత్సవాలు ప్రారంభం
- సంప్రదాయబద్ధంగా నగర సంకీర్తన
- అలరించిన మల్లాది సోదరుల సంగీత కచేరీ
- భక్తరామదాసుకు ప్రత్యేక అభిషేకం
- నేలకొండపల్లి ధ్యాన మందిరంలోనూ ఉత్సవాలు

భద్రాచలం/నేలకొండపల్లి, ఫిబ్రవరి 12: అపర భక్తాగ్రేసురుడు భక్తరామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. భద్రాచలం దేవస్థానం, హైదరాబాద్‌కు చెందిన శ్రీ చక్రా సిమెంట్స్, నేంద్రగంటి అలివేలు మంగ, సర్వయ్య చారిటబుల్ ట్రస్టు, విశాఖపట్నం నాథ సుధా తరంగిణి కల్చరల్ ట్రస్టు, విజయవాడ సామగాన లహరి కల్చరల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను దేవస్థానం ఈవో రమాదేవి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామదాసు జయంతిని పురస్కరించుకొని ముందుగా గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజా భజంత్రీలతో నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి భక్తరామదాసు చిత్రపటంతో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలతో గిరి ప్రదక్షిణ నిర్వహించి తూము నరసింహాదాసు, భక్తరామదాసు విగ్రహంల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించారు. తరువాత రామాలయ ప్రాంగణంలో ఉన్న రామదాసు విగ్రహానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అంతకుముందు శ్రీ సీతారామచంద్రస్వామి మూలవరులకు రామదాసు పేరిట ప్రత్యేక అష్టోత్తరం నిర్వహించి ఉత్సవానుజ్ఞ తీసుకున్నారు.



చిత్రకూట మండపంలో నవరత్న కీర్తనలను ఆలపిస్తున్న సంగీత కళాకారుల బృందం

నవరత్న కీర్తనలతో నీరాజనం

భక్తరామదాసు నవరత్న కీర్తనలను సంగీత కళానిధి డా. నేదునూరి కృష్ణమూర్తి, మల్లాది సోదరులు రూపొందించగా వాటిని రామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలపించారు. ఒక్కొక్క కీర్తన ముగిసిన తరువాత అర్చకస్వాములు రామయ్యకు ప్రత్యేకహారతి సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా సంగీత విద్యానిధి మల్లాది సూరిబాబు స్వరపరిచిన, మునిపెల్ల సుబ్రమణ్య కవి విరచిత ఆధ్యాత్మిక రామాయణ కీర్తనల పుస్తకాన్ని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరకర్త మల్లాది సూరిబాబును వారు ప్రత్యేకంగా అభినందించారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి భద్రాచల రామదాసు కీర్తనలకు విశేష ప్రాచుర్యం తెచ్చారని భక్తరామదాసు జయంతి ఉత్సవంలో పాల్గొన్న ప్రముఖ సంగీత కళాకారులు మల్లాది సూరిబాబు, శ్రీరామ్‌కుమార్, రవికుమార్ తదితరులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, శ్రీచక్రా సిమెంట్స్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్, చిలుకూరి బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ వ్యాఖ్యా మహిదర సీతారామశర్మ పాల్గొన్నారు.

నేలకొండపల్లిలోనూ ఉత్సవాలు

భక్తరామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లిలోనూ భక్తరామదాసు(కంచర్ల గోపన్న)జయంత్యుత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ధ్యాన మందిరంలో సీతారాములకు అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 10గంటలకు విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వరంగల్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానికులు నగర సంకీర్తన నిర్వహించారు. సరస్వతీ విద్యాలయం విద్యార్థులు రామదాసు, శ్రీరాముడు వేషధారణలతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు. అనంతరం భద్రాచలం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. తర్వాత భక్తరామదాస కీర్తనలను ఆలపించారు. తొలుత భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సభ్యులు ధ్యాన మందిరంలోని రామదాసు విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో భక్తరామదాస విద్వత్ కళాపీఠం, సర్వీస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

"మీకు మాత్రమే తక్కువకు చేస్తున్నా.. అది కూడా సర్టిఫికెట్‌తో మాకు సంబంధం లేదు. సర్టిఫికెట్ కావాలంటే మరో రేటు ఉంటుంది. మిగిలిన వారికైతే కేవలం స్లాట్ బుకింగ్ కోసమే రూ.10వేలు తీసుకున్నాం".. ఇది సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన ఓ దరఖాస్తుదారుడితో ఓ మీ-సేవ నిర్వాహకుడు చెప్పిన మాటలు.. మరో ఘటనలో ఓ మహిళ స్లాట్ బుక్ చేసుకుని ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో సదరం క్యాంప్‌నకు వస్తే అక్కడ పనిచేస్తున్న ఓ యువతి ఆమెను పరిచయం చేసుకొని సర్టిఫికెట్‌లో అంగవైకల్య శాతం పెంచాలంటే రూ.10వేలు ఖర్చవుతుందని నగదు తీసుకుంది. అయినా సర్టిఫికెట్‌లో అనుకున్న స్థాయిలో అంగవైకల్యశాతం రాకపోగా ఆమె తీసుకున్న డబ్బులు కూడా పూర్తిగా వాపస్ ఇవ్వలేదు.. ఇదీ సదరం సర్టిఫికెట్ కోసం ప్రయత్నించేవారు స్లాట్‌బుకింగ్‌నుంచే దోపిడికీ గురవుతున్న తీరు..

- సదరం క్యాంప్ స్లాట్ బుకింగ్‌లో భారీ దోపిడీ
- ఒక్కో సర్టిఫికెట్‌కు ఒక్కో రకమైన రేటు
- దళారుల అవతారమెత్తుతున్న కొందరు మీ-సేవ నిర్వాహకులు
- రూ.25నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్న వైనం
- కొన్ని కేంద్రాల నుంచే ఎక్కువ స్లాట్లు రావడంపై అనుమానాలు



సధరం దందా!

ఖమ్మం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ గురించి తెలియని వారికి ఇది ఒక సాధారణ మెడికల్ సర్టిఫికెట్‌గా అనిపిస్తుంది. కానీ ఆ సర్టిఫికెట్ అవసరం ఉన్నవారికి మాత్రం అది ఒక ఎవరెస్ట్ శిఖరంలా కనిపిస్తుంది. దివ్యాంగులకు అంగవైకల్య శాతాన్ని నిర్ణయించే ప్రామాణిక పత్రంగా ఉన్న సదరం సర్టిఫికెట్ ఆధారంగానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు రకాల పెన్షన్లు, ప్రయాణ రాయితీలను కల్పిస్తుండటంతో గత కొన్నేళ్ల నుంచి ఆ సర్టిఫికెట్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. దాన్ని ఆసరాగా చేసుకున్న దళారులు దరఖాస్తు దశనుంచే అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు 'మీ-సేవ' నిర్వాహకులు దళారుల అవతారం ఎత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్లాట్ బుకింగ్ సమయంలోనే కొందరు మీ-సేవా నిర్వాహకులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్లాట్ బుకింగ్‌లోనే భారీ దోపిడీ

సదరం సర్టిఫికెట్‌లోని వికలాంగశాతం ఆధారంగా మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌ను ఇస్తుంది. అయితే ఈ సర్టిఫికేటు పొందాలంటే మెడికల్ క్యాంపునకు హాజరైతే వైద్యులు వైకల్యశాతాన్ని నిర్ణయించి మెడికల్ సర్టిఫికేట్ ఇస్తారు. కానీ అసలు మెడికల్ క్యాంపునకు హాజరుకావడమే ప్రస్తుతం కష్టంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెడికల్ క్యాంపునకు వెళ్లేందుకు దివ్యాంగులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా అది కేవలం మీ-సేవలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. దాన్ని అదునుగా చేసుకుంటున్న కొందరు మీ-సేవల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరం సర్టిఫికేటుకు స్లాట్లు పరిమిత సంఖ్యలో ఉండటంతో తమకు ఎక్కువ మొత్తంలో ఎవరు నగదు చెల్లిస్తారో వారికి మాత్రమే ముందువరుసలో స్లాట్లు బుకింగ్ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సాధారణంగా మీ-సేవల్లో సదరం స్లాట్ బుకింగ్‌కు రూ.35 మాత్రమే చెల్లించాల్సి ఉంది. కానీ కందరు మీ-సేవ నిర్వాహకులు మాత్రం సర్టిఫికెట్ ఆధారంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలున్నాయి. ఒక్కో స్లాట్ బుకింగ్‌కు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మీ-సేవల నిర్వాహకులైతే దళారుల అవతారం ఎత్తి సర్టిఫికెట్ కూడా తామే ఇప్పించే బాధ్యత తీసుకుంటామని వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.25నుంచి రూ.40వేల వరకు వసూలు

జిల్లాలో మెడికల్ క్యాంపు నిర్వహించే ముందు స్లాట్లను విడుదల చేస్తారు. అలా విడుదల చేసిన స్లాట్లు పరిమిత సంఖ్యలోనే ఉంటుండటంతో మీ-సేవల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే దళారులతో లింకులు ఏర్పాటు చేసుకుంటున్న కొందరు నిర్వాహకులు లైఫ్‌టైం సర్టిఫికెట్‌కు ఒకరేటు, రెన్యువల్ సర్టిఫికెట్లకు మరోరేటు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ప్రత్యేక చార్జీలు వేస్తూ రూ.25నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ఖమ్మంనగరంలోని టేకులపల్లి, రోటరీనగర్, జడ్పీసెంటర్, ఆర్డీవో కార్యాలయ ప్రాంతం, మయూరిసెంటర్ వంటి ప్రాంతాలతో పాటు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లోని మీ-సేవ సెంటర్ల నిర్వాహకుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఆయా నిర్వాహకులు ముందుగా దరఖాస్తుదారులతో మాట్లాడుకున్న అనంతరం స్లాటు బుకింగ్ చేసినందుకు తమకు కావాల్సినంత వాటాను వసూలు చేసుకుని, ఆ తర్వాత తమతో లింకులు ఏర్పాటు చేసుకున్న దళారుల వద్దకు పంపుతున్నట్టు వినికిడి. ఆయా దళారులు అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో గతంలో ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిటెండెంట్‌గా పనిచేసిన ఓ వైద్యుడి ఆసుపత్రిలో పనిచేస్తున్న వ్యక్తి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అంతేకాకుండా క్యాంపుల సమయంలో విధుల్లో ఉన్న కొందరు, డీఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న మరికొందరు సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శిస్తూ బేరసారాలు మాట్లాడి రేట్లు కుదుర్చుకుంటున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదులసంఖ్యలోనే దళారులు సదరం సర్టిఫికెట్లకు ధర కట్టి ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

కొన్ని కేంద్రాల నుంచే ఎక్కువ స్లాట్లు ఎలా సాధ్యం ?

స్లాట్లను బుకింగ్ చేసేందుకు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్న కొందరు మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు మాత్రం ముందుగానే క్యాంపు నిర్వాహకులతో సంబంధాలు ఏర్పరుకుంటున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని మీ-సేవల్లో స్లాట్లు లేవని చూపించినా ఆయా మీ-సేవ నిర్వాహకుల దగ్గరకు వెళ్తే వారు డబ్బులు దండుకుని స్లాట్లు బుక్ చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. క్యాంపు నిర్వాహకులు ముందుగా కొన్ని స్లాట్లను బ్లాక్ చేసి వారికి కావాల్సిన వారికి మాత్రమే ఇస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఫలితంగా కొన్ని మీ-సేవ కేంద్రాల నుంచే ఎక్కువ మొత్తంలో స్లాట్లు బుక్ అవుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. ఫలితంగా సామాన్యులకు సదరం క్యాంపు దూరమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దీనిపై విచారణ జరపడంతోపాటు మున్ముందు ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతరంటే జాతర

- రేపటినుంచి పడమట నర్సాపురం మినీ మేడారం
- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- కొండ కోనల మధ్య గుబాళించనున్న ఆధ్యాత్మిక సౌరభం
- కోరిన వరాలిచ్చే వనదేవతలు సమ్మక్కసారలమ్మలు
- భక్తుల రాక కోసం సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు

7

పంచాయతీరాజ్‌లో బదిలీలు

- ఖమ్మం, భద్రాద్రి జడ్పీ సీఈవోలు సహా పలువురికి స్థాన చలనం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ శాఖల్లో బదిలీల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే వైద్యం, రెవెనూ, పోలీసుశాఖల్లో ట్రాన్స్‌ఫర్లు కొనసాగుతుండగా తాజాగా పంచాయతీ రాజ్‌శాఖలోనూ బదిలీల పర్వం మొదలైంది. అందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల జడ్పీ సీఈవోలతోపాటు పలువురు అధికారులు బదిలీ అయ్యారు. భద్రాద్రి జిల్లాలో జడ్పీ సీఈవో మెరుగు విద్యాలత హన్మకొండకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ములుగు సీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రసూనారాణి భద్రాద్రి జిల్లాకు వచ్చారు. అదే విధంగా డీఆర్‌డీవోపీడీ జి.మధుసుదన్‌రాజు సూ ర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం డీఆర్‌డీవో విద్యాచందన రానున్నారు. డిప్యూటీ సీఈవో బి.నాగలక్ష్మీ ఖమ్మం డిప్యూటీ సీఈవోగా వెళ్లారు. ఖమ్మంలో పనిచేస్తున్న కె.చంద్రశేఖర్ భద్రాద్రికి వెళ్లనున్నారు. భద్రాద్రి జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న లక్కినేని లక్ష్మీరమాకాంత్ హన్మకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో భద్రాద్రి జిల్లా నూతన పంచాయతీ అధికారిగా పెద్దపల్లి జిల్లాలో పని చేస్తున్న వి.చంద్రమౌళి నియమితులయ్యారు. ఇక ఖమ్మం జిల్లాలోనూ పలువురు అధికారులకు స్థాన చలనం కలిగింది. ఖమ్మం జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావును సూర్యాపేటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాదు టీఎస్ఐఆర్‌డీలో పనిచేస్తున్న ఎస్.వినోద్‌ను ఖమ్మం జడ్పీ సీఈవోగా నియమించారు. ఆయనతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లను కూడా బదిలీ చేశారు. ఖమ్మం డీఆర్‌డీవో ఏపీడీగా పనిచేస్తున్న బి.శిరీషను సూర్యాపేట జిల్లా డిప్యూటీ సీఈవోగా నియమించారు.



భద్రాద్రి దేవస్థానం

ఈవో బదిలీ

కీసర ఆర్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.రమాదేవి బదిలీ అయ్యారు. ఆమెను కీసర రెవెన్యూ డివిజనల్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేయగా ఇందులో ఈవో రమాదేవి ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ జీవో-79ని జారీ చేశారు. గత ఏడాది ఫిబ్రవరి 16న దేవస్థానం ఈవోగా రమాదేవి అదనపు బాధ్యతలు చేపట్టగా ఐదు నెలల క్రితం రెగ్యులర్ ఈవోగా నియమితులాయ్యారు. ఈవోగా రమాదేవి భద్రాచలం దేవస్థానాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై శాఖపరంగా చర్యలు తీసుకున్నారు. పరిపాలనలో పూర్తిస్థాయి పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ భక్తులకు సదుపాయాలపై దృష్టి సారించి మన్ననలు పొందుతున్నారు. ఇప్పుడిప్పుడే భద్రాద్రి రామాలయం అభివృద్ధి పథాన నడుస్తున్న క్రమంలో ఈవో రమాదేవిని ఆకస్మికంగా బదిలీ చేయడాన్ని భక్తులు, భద్రాద్రివాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, భద్రాద్రి ఆలయ అభివృద్ధికి కృషి చేసే ఈవోను కొనసాగించాలని భద్రాద్రివాసులు, భక్తులు, వివిధ రాజకీయపక్షాల నాయకులు కోరుతున్నారు.

'కూరాకుల' అవిశ్వాసంపై

నేడు కోర్టు తీర్పు?

- జనవరి 27న వీవీపాలెం సొసైటీలో ఓటింగ్ పూర్తి
- హైకోర్టు ఆదేశాల మేరకు ఫలితాల ప్రకటన వాయిదా



ఓటింగ్‌కు హాజరైన వీవీపాలెం సొసైటీ డైరెక్టర్లు(ఫైల్)

రఘునాథపాలెం, ఫిబ్రవరి 12: డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై పెట్టిన అవిశ్వాస వ్యవహారం నేడు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. కూరాకుల ప్రాతినిధ్యం వహిస్తున్న వీ వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్(డీసీసీబీ చైర్మన్)అధ్యక్ష పదవిపై మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించే అవకాశం ఉందని సొసైటీ పరిధిలోని డైరెక్టర్లు పేర్కొంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కూరాకుల నాగభూషయ్య రఘునాథపాలెం మండలంలోని వీ వెంకటాయపాలెం సహకార సొసైటీ నుంచి చైర్మన్‌గా ఎన్నికై డీసీసీబీ చైర్మన్‌గా నియమితులయ్యారు. అయితే వీ వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ తమకు అందుబాటులో ఉండటం లేదని, సమావేశాలు నిర్వహించటం లేదని, కనీసం డైరెక్టర్లను గుర్తించటం లేదని ఆరోపిస్తూ ఆ సొసైటీ పరిధిలోని మొత్తం 13మంది డైరెక్టర్లలో 11మంది జనవరి 12న జిల్లా సహకార అధికారికి అవిశ్వాస పత్రం అందించారు. దీంతో సహకార చట్టం నిబంధనల మేరకు డైరెక్టర్లకు నోటీసులు జారీచేసి జనవరి 27న వీవీపాలెం సొసైటీలో అవిశ్వాసపై ఓటింగ్ నిర్వహించారు. అయితే ఓటింగ్ రిజల్ట్‌ను వాయిదా వేయాలని కూరాకుల నాగభూషయ్య హైకోర్టును ఆశ్రయించడంతో తీర్పును వాయిదా వేశారు. జనవరి 30వరకు ఓటింగ్ ఫలితాన్ని వాయిదా వేయాలని కోర్టు ఆదేశాల మేరకు తీర్పును డీసీవో ప్రకటించలేదు. కానీ ఓటింగ్ విధానం వీడియో చిత్రీకరణ, డైరెక్టర్ల వాంగ్మూలాన్ని డీసీవో కోర్టుకు అందించారు. అయితే పూర్తి వివరాలను పరిశీలించిన కోర్టు తీర్పును మాత్రం ప్రకటించలేదు. అయితే మంగళవారం కోర్టు తీర్పు వెలువడుతుందని సొసైటీ డైరెక్టర్లు భావిస్తున్నారు. వీవీ.పాలెం సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గితే ఆ ప్రభావం డీసీసీబీ చైర్మన్ పదవిపై పడనుందని డైరెక్టర్లు చెబుతున్నారు.

- రాజ్యాంగ విలువలను కేంద్ర పాలకులు ధ్వంసం చేస్తున్నారు
- పేద విద్యార్థులందరికి కార్పొరేట్ స్థాయి విద్య అందించాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర సభల ముగింపులో వక్తలు



సావనీర్‌ను విడుదల చేస్తున్న వక్తలు, నాయకులు

విద్యలో సమానత్వం లేదు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 12: ప్రస్తుతం వ్యక్తి ఆర్థిక స్తోమత మీద ఆధారపడి విద్య లభించే దుస్థితి నెలకొందని, విద్యలో సమానత్వం లేకపోవడం విచారకరమని ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు, రాజనీతి పరిశీలకుడు ఏ. నర్సింహారెడ్డి పేర్కొన్నారు. పేద విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఖమ్మం నగరంలోని నయాబజార్ పాఠశాలలో జరుగుతున్న తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ హరిగోపాల్, ఏనర్సింహారెడ్డి, హేతువాద రచయిత్రి చందనా చక్రవర్తి, బుర్ర రమేష్‌ప్రసాద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ హాజరయ్యారు. 'అంతరాల విద్య, ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత' అంశంపై రాజనీతి పరిశీలకుడు ఏ.నర్సింహారెడ్డి ప్రసంగించారు. వలసపాలనకు ముందు, తరువాత దేశపాలన విధానాల్లో ఎలాంటి మా ర్పు లేదన్నారు. వలస పాలన నుంచి స్వేచ్ఛ పొందినవారిలో సామాన్యులు లేరన్నారు. కార్పొరేట్లకు, వలస పాలకులకు మధ్య మాత్రమే అధికార మార్పిడి జరిగిందని అభిప్రాయపడ్డారు. వలస పాలన కాలంలో రాజకీయ, సాంస్కృతిక, సంస్కరణ ఉద్యమాలు జరిగాయి కానీ స్వాతంత్య్రం వచ్చిన తరువాత కనీసం అవి కూడా లేవన్నారు. గ్లోబలైజేషన్ ఫలితంగా 1990 నుంచి విద్య సిలబస్, కరికులం సంబంధించిన అన్ని విద్యరంగ అంశాలు ప్రపంచ ఆర్థిక సంస్థల చెప్పుచేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. పాఠశాలల్లో బాలికలపై జరుగుతున్న వివక్షతను నిరోధించడంలో ఉపాధ్యాయులు విఫలమవుతున్నారన్నా రు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కేంద్ర పాలకులు ధ్వంసం చేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని మార్చే అవకాశం ఉందన్నారు. అదే జరిగితే రాజనీతిశాస్త్రంతో పాటు ఇతర గ్రంథాలలో రాధాకృష్ణుల గురించి, సీతా పరిత్యాగం గురించి చదువుకోవాల్సి వస్తుందన్నారు. మానవ నాగరికత, అభివృద్ధికి సంబంధించి ఎవ్వరూ ప్రశ్నలు అడగటం లేదన్నారు. 1980దశకంలో దేశంలో ఆర్థిక అభివృద్ధి జరిగిందని, 1990 దశకంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. కానీ నేడు మత ఛాందసవాదం ఎన్నికల వరకు వచ్చిందన్నారు. రాజకీయాల్లో మతానికి అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. సభలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ప్రసంగించారు. అనంతరం టీపీటీఎఫ్ రాష్ట్రకమిటీ 14 తీర్మానాలను ప్రవేశపెట్టి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సంఘం రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అభినవ హరిదాసు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 12: సంక్రాంతి సందర్భంగా తెల్లవారుజాము సమయంలో హరిదాసులు భక్తిపాటలు పాడుతూ పల్లెల్లో సందడి చేయడం తెలుగు సంస్కృతి, సంప్రదాయంలో ఆనవాయితీ. గ్రామాల్లో భక్తిపాటలు ఆలపిస్తూ వీధివీధి నడుస్తూ తిరిగేవారు. తాజాగా దుమ్ముగూడెంలో సోమవారం ద్విచక్రవాహనంపై వీధుల వెంట తిరిగిన హరిదాసును స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ద్విచక్రవాహనానికి సౌండ్‌బాక్స్ అమర్చి రికార్డు చేసిన భక్తిగీతాలను వినిపిస్తూ సంచరించారు. కాలానుగుణంగా చాలా పద్ధతులు మారినట్లు హరిదాసులు కూడా పద్ధతి మార్చారు. నడిచే ఓపిక లేక ఇలా ద్విచక్రవాహనాలపై తిరుగుతున్నామని సత్తుపల్లికు చెందిన హరిదాసు గోపి తెలిపారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న తహసీల్దార్ యోగీశ్వరరావు

సత్తుపల్లిలో నాన్ ఏసీ 'లహరి' బస్సులు ప్రారంభం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12: సత్తుపల్లి నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు 'లహరి' పేరుతో నాన్ ఏసీ స్లీపర్ క్లాస్ బస్సులను తహసీల్దార్ కే.యోగేశ్వరరావు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రారంభించారు. ప్రయాణీకులు సౌకర్యవంతంగా గమ్యం చేరేందుకు ఈ రెండు బస్సులను టీఎస్‌ఆర్టీసీ వీటిని ప్రవేశపెట్టగా సత్తుపల్లి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సర్వీస్‌లో 33 సీట్లు, 15 బెర్త్ (690)ఉండగా ఫ్రీ వైఫై, సెల్ ఛార్జింగ్, వాటర్ బాటిల్ అందిస్తామని డిపో ఉద్యోగులు తెలిపారు. సీటు ధర రూ.580 కాగా, బెర్త్ ధర రూ.690గా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డీఎం యూ.రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరి సాహితీ, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, గిర్ధావర్ నరేష్ పాల్గొన్నారు.

తుప్పల్లో తుప్పుగా !

- శిథిల వాహనాలతో నిండిన జిల్లా రవాణాశాఖ కార్యాలయం
- తుప్పు పట్టి తుక్కుగా మారిన 350వాహనాలు
- ఏళ్ల తరబడి వేలానికి నోచుకోని వైనం
- త్వరలో వేలం వేస్తాం: జిల్లా రవాణా అధికారి గౌస్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 12: రెండు యూనిఫాం శాఖల మధ్య సమన్వయలోపం వందల వాహనాలకు శాపంగా మారింది. "మనకెందుకులే.." అని ఎవరికి వారు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పలు సందర్భాల్లో పోలీసుశాఖ సీజ్ చేసిన వాహనాలు ముళ్ల పొదల్లో తుప్పుగా మారుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా పని చేసిన కాలంలో ఆయన ప్రత్యేక చొరవతో ఖమ్మం జిల్లా కేంద్రంలో రవాణాశాఖకు ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలం నేడు శిథిలమైన వాహనాలకు డంపింగ్ యార్డుగా మారింది. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసుశాఖ ఆయా ప్రమాదాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రవాణాశాఖకు సమాచారం అందిస్తే వారు సదరు వాహనం కండిషన్ పరిశీలించి 24గంటల లోపులో స్థానికంగా ఉన్న పోలీసుస్టేషన్‌లకు తరలిస్తారు. ఆ తరువాత కోర్టులో కేసు విచారణ సమయంలో ఆయా వాహనాలు సదరు పోలీసుస్టేషన్‌ల పరిధి నుంచి కోర్టుకు తీసుకొచ్చి ఆధారాల పరిశీలన తరువాత తిరిగి తీసుకెళతారు. కానీ అలా కోర్టులకు వెళ్లే వాహనాలు మళ్లీ పోలీసుస్టేషన్‌లకు వెళ్లకుండా జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి రావటంతో సమస్య ఉత్పన్నమైంది.

2018నుంచి రవాణాశాఖలోనే..

2018లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన పోలీసు క్రైమ్ రివ్యూ సమావేశంలో సుదూర ప్రాంతాల పోలీసుస్టేషన్‌ల నుంచి వాహనాలను కోర్టుకు తీసుకురావటం ఇబ్బందిగా ఉందని, అలాగే ఖమ్మంనగరంలోని పోలీసుస్టేషన్‌ల్లో వాహనాలను ఉంచేందుకు స్థలం సరిపోవటం లేదని పోలీసుశాఖ వినతిమేరకు ఆ నాటి రవాణాశాఖ అధికారులు అనుమతి ఇవ్వటంతో ఆయా పోలీసుస్టేషన్లలో ఉన్న 300లకు పైగా వాహనాలను ఖమ్మం రవాణాశాఖ కార్యాలయానికి తరలించారు. అప్పటి నుంచి పోలీసులు ఆయా వాహనాలను తిరిగి తీసుకెళ్లడంగానీ వాహనాలను వేలం వేయటం కానీ చేయలేదు. కోర్టులో వాహనాల కేసు వచ్చిన సమయంలో సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బంది రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లడం ఆయా వాహనాలను కోర్టులో హాజరు పరిచి మళ్లీ రవాణాశాఖ కార్యాలయానికి తీసుకురావడం పరిపాటిగా మారింది. దాంతో రవాణాఖ కార్యాలయంలో వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి అసలు ఏ వాహనం ఏ పోలీసుస్టేషన్ పరిధిలోనిదో గుర్తించే వీలు లేకుండా వాహనాలు తప్పుపట్టి తుక్కుగా మారాయి. కోర్టు విచారణకు వాహనాలు బయటకు వెళ్లి తిరిగి కార్యాలయంలోకి తీసుకొచ్చే సమయంలో వాటి ఎంట్రీలు నమోదు చేసుకోవటం రవాణాశాఖ ఉద్యోగులకు అదనపు భారంగా మారింది. దీనికి తోడుగా మూడేళ్ల క్రితం ప్రభుత్వ కార్యాలయాల్లో శిథిలమైన వాహనాలను ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వేలం వేయగా అక్కడ అమ్ముడుపోని ప్రభుత్వ వాహనాలను ఆయా ప్రభుత్వశాఖలు తిరిగి తీసుకెళ్లకుండా డిగ్రీ కాలేజీ మైదానంలోనే నెలల తరబడి ఉంచటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ వాహనాలను సైతం రవాణాశాఖకు తరలించారు. వీటికి తోడు నిత్యం రవాణాశాఖ తనిఖీల్లో దస్త్రాలు లేని వాహనాలు, అక్రమ రవాణ వాహనాలు మరో 50వరకు కోర్టు కేసుల పెండింగ్ కారణంగా ఇక్కడే ఉండి పోయాయి. దీంతో ఖమ్మం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏటు చూసినా శిథిలమైన వాహనాల డంపింగ్ యార్డుగా మారింది. వాహనాల చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోయాయి. వాటిలో చీమలు పుట్టలు పెట్టడంతో పాములు చేరాయి. దీంతో రవాణాశాఖ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

తమ కార్యాలయంలో సంబంధం లేని వాహనాలను ఇక్కడే పార్క్ చేశారని జిల్లా రవాణాశాఖ కార్యాలయం నుంచి ఖమ్మం పోలీసు కమిషనర్ కార్యాలయానికి ప్రతి ఆరు నెలలకోసారి లేఖలు రాస్తున్నారు. ఆయా లేఖలపై స్పందించిన పోలీసు అధికారులు వాటి లెక్కలు బయటకు తరలిస్తామని సమాధానం ఇస్తున్నారే తప్ప వాహనాలను తరలించిన దాఖలాలు లేవు.



చెత్త కుప్పల్లో వాహనాలు



ఓపెన్ టెండర్ వేస్తాం

గత నాలుగు సంవత్సరాలుగా శిథిలమైన వాహనాల వేలం జరగలేదు. పోలీసు శాఖకు సంబంధించిన కేసుల వాహనాలే వీటిలో ఎక్కువగా ఉన్నాయి. కోర్టు తీర్పు తర్వాత కూడా ఆయా వాహన యజమానులు తమ వాహనాలను తీసుకెళ్లడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అవకాశం ఉన్న వాహనాలను ఓపెన్ టెండర్ పెట్టి తొలగిస్తాం.

- గౌష్‌పాషా, జిల్లా రవాణాశాఖ అధికారి

ఏటీసీ ఏర్పాటుకు స్థల పరిశీలన

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 12:మణుగూరు ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)లో టాటా టెక్నాలిజీస్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలిజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. సోమవారం వరంగల్ టాటా టెక్నాలిజీస్ ప్రతినిధి ఐటీఐ పరిధిలోని స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి అనుకూలంగా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ బీ ప్రభాకర్‌తోపాటు ఇన్‌స్ట్రక్టర్‌లు, సిబ్బందితో కలిసి ఏటీసీకి కావాల్సిన వసతులపై చర్చించారు. రోజురోజుకు పెరుగుతున్న అత్యాధునిక సాంకేతికను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతోనే ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటీఐలలోని విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని, ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి రవి పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేత జట్టు

డాక్టర్స్ క్రికెట్ టోర్నీ విజేత ఖమ్మం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న నాలుగు జిల్లాలస్థాయి డాక్టర్స్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. టోర్నీ విజేతగా ఖమ్మం డాక్టర్స్ జట్టు నిలవగా రన్నరప్‌గా మిర్యాలగూడ జట్టు నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు కంభంపాటి నారాయణరావు, జగదీష్ బహుమతులు ప్రదానం చేశారు. ఖమ్మం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా టోర్నీ విజయవంతానికి కృషి చేసిన ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్‌ను సెజ్లర్ ఫార్మా కంపెనీ ప్రతినిదులు నరేష్, సంతోష్ తదితరులు అభినందించారు.

ఖమ్మం జిల్లా కబడ్డీ జట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: ఈ నెల 16 నుంచి 19వరకు సూర్యాపేట జిల్లా మల్లారెడ్డి గూడెం (చింతలపాలెం)లో నిర్వహించే 33వ అంతర జిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లను సోమవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లావ్యాప్తంగా సుమారు 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ క్రిష్టఫర్ ప్రకటించారు. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్, చంద్రశేఖర్, నరేష్, శోభన్, శివరామక్రిష్ణ, శివ జ్యోతి, ప్రవీణ్ తదితరులు సమీక్షించారు.





ఎంపికైన బాలికల జట్టు, బాలుర జట్టు

నేడు సీనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సీనియర్ పురుషుల, మహిళల హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9.30 కల్లా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెంకటగిరి విద్యార్థిని

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని వెంకటగిరి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చింతకాయల నందిని ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఖమ్మం జిల్లా జట్టుకు నందిని ఎంపికైనట్టు తెలిపారు. ఈ పోటీలు ఫిబ్రవరి 16వ తేదీనుంచి 19వరకు సూర్యాపేట జిల్లా, చింతలపాలెంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పీఈటీ రాజకుమారి తదితర ఉపాధ్యాయులు నందినిని అభినందించారు.

పత్తి తూకాల్లో దళారుల దగా

- ఏళ్ల తరబడి మోసపోతున్న అన్నదాతలు
- పట్టుబడితే పంచాయతీలతో సరి

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 12: రైతు ఆరుగాలం శ్రమతో పండించిన పంటకు గిట్టుబాటు ధర సమస్యతో పాటు తూకాల మోసాల బాధ తప్పడం లేదు. ఏటా మండలంలో ఏదో ఒక ప్రాంతంలో దళారులు కాంటా మోసానికి పాల్పడుతూ, రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఏళ్ల తరబడి పలు సందర్భాలలో కాంటా మోసాలతో వ్యాపారులు పట్టుబడుతున్నప్పటికీ, ఏ ఒక్క సందర్భంలోనూ పోలీస్ కేసు నమోదు కాలేదు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు స్థానిక పెద్దలు మోసం పేరుతో పంచాయతీ నిర్వహించి వ్యాపారి వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని వదిలిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే జరిమానా పేరిట వ్యాపారి నుంచి వసూలు చేసిన డబ్బును నష్టపోయిన రైతుకు పూర్తిగా ఇవ్వకుండా, పంచాయతీ చేసిన పెద్దలు తమ జేబుల్లో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు వ్యాపారులు పత్తి, ధాన్యం కాంటాల్లో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడడానికి అలవాటు పడి రైతుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. తాజాగా సింగారంలోనూ సోమవారం ఓ వ్యాపారి పత్తి తూకాల్లో తప్పుడు కాంటా వేసి పట్టుబడ్డాడు.

పంచాయతీల్లో డబ్బులు పెద్దల జేబుల్లోకి...

మండల సరిహద్దు సీజీ మారాయిగూడెంలో 2022లో పత్తి కాంటా వేసి ఓ వ్యాపారి దొరికిపోగా, స్థానిక పెద్దలు పంచాయతీ చేసి రూ.2.50లక్షలను పరిహారంగా వసూలు చేశారు. అలాగే గత కొన్నేళ్లుగా కెవీరభద్రారం, నడికుడి, నందులచెలక, అంజుబాక, ఆర్లగూడెం, రేగుంట, చింతగుప్ప, పత్తిపాకల్లో పత్తి కాంటాల్లో మోసం చేసిన వ్యాపారులను స్థానిక రైతులు పట్టుకున్నారు. ఐతే పరిహారం పూర్తిగా నష్టపోయిన రైతులకు కాకుండా మధ్యవర్తిత్వం చేస్తున్న పెద్దల జేబుల్లోకి వెళ్తుండడంతో అక్రమాలు బైటపడడం లేదు. అలాగే 2016లో చిననల్లబల్లిలో రూ.20వేల పరిహారాన్ని, 2015లో పత్తిపాకలో రూ.30వేలు, ఎటపాక మండలం సుబ్బారావుపేటలో 2018లో రూ.50వేల పరిహారం చెల్లించాడు. అలాగే ఒకరిద్దరు స్థానిక వ్యాపారులు సైతం గతంలో పత్తి దొంగ కాటాలు వేసి అడ్డంగా దొరికిన సందర్భాలున్నాయి.

తాజాగా సింగారంలో పట్టుబడిన వ్యాపారి

సింగారంలోని ఓ చిరువ్యాపారి వద్ద బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి చెందిన ఓ వ్యాపారి పత్తిను కొనుగోలు చేశాడు. స్థానిక వ్యాపారులు ఇవ్వచూపిన ధరకంటే ఎక్కువగా చెల్లిస్తానని చెప్పి సోమవారం మూడు పెద్ద బస్తా(బోరేలు)ల్లో తొక్కి ఉంచిన పత్తిని సదరు వ్యాపారి తూకం వేసి కొనుగోలు చేశాడు. బరువు తక్కువ తూగడంతో అనుమానించిన సింగారం చిరువ్యాపారి తన దగ్గర ఉన్న కాంటాతో తనిఖీ చేయడంతో మోసం బైటపడింది. ఒక్కో బస్తా(బోరం)కు 40 కేజీలు అదనపు తూకాన్ని గుర్తించగా, మొత్తం 120 కేజీల మోసం జరిగినట్లు బైటపడింది. దీంతో పత్తి కొనుగోలు చేయడానికి వచ్చిన వారిని, వారి వాహనాన్ని సింగారం వ్యాపారి సంబంధికులను నిలిపివేశారు. అక్రమ వ్యాపారికి మద్దతుగా రెడ్డిపాలెనికి చెందిన కొందరు వ్యాపారులు పంచాయితీ పెట్టారు. సదరు లక్ష్మీపురం వ్యాపారికి పంచాయతీ పెద్దలు రూ.లక్ష జరిమానా వేయడంతో నగదు చెల్లించి బైటపడ్డాడు. ఇలా పలు సందర్భాలలో పత్తి కాంటాల మోసం బైటపడుతున్నప్పటికీ, పోలీసు శాఖకు ఫిర్యాదు చేయకపోవడంతో ఎటువంటి చర్యలు ఉండటం లేదు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నప్పటికీ తూనికలు, కొలతల శాఖ నుంచి ఎటువంటి చర్యలుండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అక్రమ వ్యవహారాలపై పోలీసుశాఖ సుమోటోగా స్పందించి అక్రమ తూకాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



సింగారంలో పట్టుబడిన వ్యాపారి వాహనం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టేకులపల్లి, ఫిబ్రవ రి 12: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తావుర్యాతండాలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తావుర్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు గోపి(35) ఆదివారం రాత్రి ఇంటి నుంచి టేకులపల్లి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో తడికలపూడి రహదారిలో రాళ్లవాగు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడ్డాడు. సోమవారం ఉదయం వరకు గోపి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శవమైకన్పించాడు. మృతుడి భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు..

ఖమ్మంక్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగింది. సుమారు 23 ఏళ్ల వయస్సున్న యువకుడు నగరంలోని మధ్యగేటు సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై మృతదేహం లభించింది. రైల్వే పోలీసులు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో ధాన్యం దగ్ధం

అశ్వారావుపేట, ఫిబ్రవరి, 12: విద్యుదాఘాతంతో ధాన్యం దగ్ధమైన సంఘటన వినాయకపురం గ్రామంలోని శ్రీరామ రైస్ మిల్లులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రైస్ మిల్లులో ఉన్న షెడ్డులో నిల్వ ఉంచిన ధాన్యానికి నిప్పంటుకుంది. గమనించిన కార్మికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే సుమారు 2వేల ధాన్యం సంచులు, కొంత మేర ధాన్యం కాలిపోయింది. సుమారు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లినట్లు మిల్లు యాజమానులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కల్లూరు, ఫిబ్రవరి 12: కల్లూరులో అక్రమంగా రవాణా అవుతున్న పశువులను సోమవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ షాకీర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు క్రాస్ రోడ్డు వద్ద అన్నప్పరెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం నుంచి ఓ వాహనంలో ఆరు ఆవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఆవులను తరలిస్తున్న కృష్ణయ్య, జోగు చెన్నారావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా.. 12 మందికి గాయాలు

కరకగూడెం, ఫిబ్రవరి 12: కారు బోల్తా పడి 12 మందికి గాయాలైన సంఘటన మండల పరిధిలో మోతె వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరుకు చెందిన 12 మంది మేడారం వెళ్లి తిరిగి వస్తుండగా మోతె గ్రామ శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో 12 మందికి గాయాలు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను మణుగూరు వైద్యశాలకు తరలించారు.

వినియోగదారుల వద్దకే విద్యుత్ ఫోరం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి12: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు వ్యవసాయ విద్యుత్‌లో వస్తున్న ఇబ్బందులు, ఇతర సమస్యలను పరిష్కారం చేసేందుకు వినియోగదారుల వద్దకే ఫోరమ్ నినాదంతో మంచుకొండ విద్యుత్ సబ్ డివిజన్‌కే విద్యుత్ కోర్టు వస్తోంది. విద్యుత్‌లో హెచ్చు తగ్గులు, లోపాలు, మీటర్లు మార్పు, రైతులు ట్రాన్స్ ఫార్మర్ల మార్పు, నూతన సర్వీసుల ఏర్పాటులో జాప్యం, కేటగిరి మార్పులో ఇబ్బందులు వంటి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం చేస్తారు. ఈనెల 14న మంచుకొండ విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ తిరుమలరావు సోమవారం ప్రకటించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు వినియోగదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామని ప్రకటించారు.

ఇసుక లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి12: నడిరోడ్డుపై ఇసుక లారీ దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని లలితపురం గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మణుగూరు నుంచి ఇల్లెందు వెళ్తున్న టీఎస్05 యూడీ0558 నెంబర్ గల ఇసుక లారీలో వెనుక భాగం నుంచి మంటలు చెల రేగాయి. ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ అప్రమ త్తమై కిందకు దిగడంతో ప్రమాదం తప్పింది. డీజిల్ ట్యాంకర్ లీక్ కావడం వల్లనే ప్రమాదం జరిగి ఉండవ చ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలలు జైలుశిక్ష

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 12: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం పట్టణ కేంద్రానికి చెందిన బిజ్జాల భాస్కర్ కి ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థాన న్యాయాధికారి కాసరగడ్డ దీప నిందితుడికి 6 నెలలు జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని సోమవారం తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం పట్టణం బి.కె.బజార్‌కు చెందిన ఉల్లి శ్రీనివాసరావు అలియాస్ శ్రీను దగ్గర నిందితుడు భాస్కర్ 2016 నవంబరు 29, డిసెంబరు 6న రెండు సార్లు రూ.లక్ష చొప్పున అప్పుగా తీసుకన్నాడు. శ్రీను అప్పు ఇవ్వమని ఒత్తిడి చేయగా చెల్లని చెక్కు ఇచ్చాడు. దీంతో బాధితుడు భాస్కర్‌పై కేసు వేయగా, చెల్లని చెక్కు కేసులో 6 నెలల శిక్ష, బాధితుడికి రూ.3లక్షలను ఇవ్వాలని కోర్టు తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న 20 మొబైల్స్ అందజేత

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి12: సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న 20 మొబైల్ ఫోన్లను ట్రాక్‌చేసి సోమవారం సీపీ కార్యాలయంలో బాధితులకు అప్పగించినట్టు సైబర్ క్రైం ఏసీపీ శంకర్ తెలిపారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సీఈఐఆర్ పోర్టల్ విధానంతో ఇప్పటి వరకు రూ.30లక్షల విలువ గల 550 ఫోన్లను లాక్‌చేసి వాటిని ట్రేస్ చేసి యజమానులకు అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రంజిత్‌కుమార్, విజయ్, కానిస్టేబుల్ నాగేంద్రమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

15 పామాయిల్ డ్రమ్ములు పట్టివేత

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న పామాయిల్ డ్రమ్ములను పట్టణంలోని హనుమాన్‌నగర్ వద్ద పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..హనుమాన్‌నగర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పామాయిల్ నింపిన 15 డ్రమ్ములు ఉన్నాయి. వాటిని ఎక్కడ నుంచి తీసుకొని వస్తున్నారని వాహనంలోని వ్యక్తితోపాటు ఆరుగురు వ్యక్తులను విచారించగా అయిల్‌ను పామాయిల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే లారీ ట్యాంకర్ల వద్దనుంచి కొనుగోలు చేసి, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నట్లు విచారణలో తెలిసింది. వారి వద్ద నుంచి ఒక అశోక్‌లే లాండ్ వ్యాన్, 15 డ్రమ్ములలో నింపిన ఆయిల్‌ను స్వాధీన పరుచుకుని, నిందితులను అదుపులోని తీసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలం చెల్లిన పదార్థాల విక్రయాలు

- కేక్ విక్రయించిన యజమానికి రూ. 7వేల జరిమానా

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 12: కాలం చెల్లిన బేకరీ పదార్థాలను తిని పలువురు అస్వస్థతకు గుర య్యారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఓ వ్యక్తి పాల్వంచ రాజీవ్ గాంధీ మార్కెట్ రోడ్ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ఏ-5 ఐస్ మ్యాజిక్‌లో కూల్ కేక్‌ను ఆదివారం రాత్రి కొనుగోలు చేశాడు. వేడుక సందర్భంగా కేక్ తిన్న ముగ్గురు చిన్నారులకు పది నిమిషాలలలోనే అస్వస్థతకు గురయ్యారు. చిన్నారులు తీవ్రంగా బాధపడుతుండగా కేక్ పరిశీలించగా బూజు పట్టి ఉండటాన్ని గుర్తించారు. సోమవారం సదరు వ్యక్తి మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు తన సిబ్బందితో కలసి దుకా ణంలో తనిఖీలు నిర్వహించారు. ఫిర్యాదు దారుడికి విక్రయించిన కేక్‌ను షాపులోనే కొనుగోలు చేసినట్లు, అది కాస్తా బూజు పట్టినట్లుగా అధికారులు గుర్తించి, సదరు యజమానికి రూ.7వేలు జరిమానా విధించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



కేక్‌లను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

కుమారుడి మృతిని తట్టుకోలేక..

మనస్తాపంతో హోంగార్డు ఆత్మహత్య

కారేపల్లి, ఫిబ్రవరి12: కుమారుడి మృతిని తట్టుకోలేక మనస్తాపంతో హోంగార్డు మృతి చెందిన సంఘటన మండలం పరిధిలోని మాదారం డోలమైట్ మైన్స్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మాదారం డోలమైట్ మైన్స్‌లో 11ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న చిరునగరి నాగేశ్వరసూరి(52) కుమారుడు ఇటీవల బీచ్ ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి మృతుడు సూరి మానసికంగా ఇబ్బందులు పడుతూ తనకు బతకాలని లేదని, తన కుమారుడు లేకపోవడంతో తనకు జీవితం మీద విరక్తి కలుగుతుందని కుటుంబ సభ్యులతో అంటు ఉండేవాడు. ఈ క్రమంలో మృతుడి భార్య నాగమణి కూసుమంచి మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించేందుకు వెళ్లింది. కాగా ఆదివారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఫోన్ చేసిన సమయంలో ఎంతకి ఎత్తకపోవడంతో, ఇంటి పక్కనే ఉంటున్న మరో హోంగార్డును ఇంటికి వెళ్లి చూసి రమ్మని తెలిపింది. వారు ఎంత సేపు తలుపుకొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా, ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ సీఐలకు స్థాన చలనం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 12: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖకు బదిలీల కుదుపు ఏర్పాడింది. లోకసభ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ బదిలీలు జరిగాయి. ఖమ్మం 1సీఐ రాజును వరంగల్ ఖిల్లాకు, ఇదే స్టేషన్‌కు మహాబాద్ జిల్లా డీటీఎఫ్ నుంచి కృష్ణ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఖమ్మం2 రాజిరెడ్డిని మణుగూరుకు బదిలీ జరిగింది. ఇక్కడకు పరకాల నుంచి చంద్రమోహన్ రానున్నారు. ఖమ్మం డీటీఎఫ్ విజయేందర్ ఆదిలాబాద్‌కు కాగా ఖమ్మం డీటీఎఫ్‌కు హనుమకొండ ఐఎంఎల్ డీపో నుంచి కరుణశ్రీ రానున్నారు. సత్తుపల్లి సీఐ రాజశేఖర్‌కు వేములవాడకు బదిలీ జరిగింది. ఇక్కడకు బూపాలపల్లి నుంచి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బదిలీ జరిగింది. వైరా సీఐ రమ్యరెడ్డి బూపాలపల్లికి బదిలీ కాగా ఇక్కడకు నాచారం నుంచి మమత వైరాలో బాధ్యతలు స్వీకరించనున్నారు. మణుగూరు సీఐ రాంమూర్తి మధిరకు బదిలీ కాగా మధిర సీఐ ప్రసాద్‌కు పాల్వంచకు, పాల్వంచ సీఐకు సుల్తాన్‌బాద్ బదిలీ చేశారు. కాగా నేలకొండపల్లి సీఐ పోశెట్టికు పెద్దపల్లి, పరకాల సీఐ జగన్నాథరావు నేలకొండపల్లికి రానున్నారు. సింగరేణి సీఐ రేహ్మాద్ ఇచ్చోడాకు బదిలీ కాగా కాటారం సీఐ ప్రశాంతి సింగరేణికి రానున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మేంట్ సీఐ సర్వేశ్వర్‌రావు జగిత్యాల బదిలీ కాగా ఆయన స్థానంలో రామగుండం నుంచి ఎస్ రమేశ్ బదిలీ జరిగింది. కొత్తగూడెం డీటీఎఫ్ సీఐ చిన్నా నాగేశ్వరరావుకు వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కాగా ఆయన స్థానంలోకి సనత్‌నగర్ డిస్టలరీ సీఐ సాంబమూర్తి రానున్నారు.



గోదావరమ్మకు పూజలు



చిత్రకూట మండపంలో మల్లాది సోదరుల కచేరీ

జయహో భక్తరామదాసా..



నేలకొండపల్లిలో నగర సంకీర్తన

అపర భక్తాగ్రేసరుడు భక్తరామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. నవరత్న కీర్తనలతో భద్రాద్రిలో భక్తిభావం వెల్లివిరిసింది.



దేవస్థానం ఈవో, శ్రీ చక్రా సిమెంట్స్ నిర్వాహకులు

జాతరంటే జాతర... పడమట నర్సాపురం జాతర





సారలమ్మ, సమ్మక్క గద్దెలు

- రేపటి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం
- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- కొండ కోనల మధ్య గుబాళించనున్న ఆధ్యాత్మిక సౌరభం
- కోరిన వరాలిచ్చే వనదేవతలు సమ్మక్కసారలమ్మలు
- భక్తుల రాక కోసం సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు
- జన సంద్రం కానున్న 'మినీ మేడారం'

జూలూరుపాడు, ఫిబ్రవరి12: మినీ మేడారంగా ప్రసిద్ధి పేరుగాంచిన జూలూరుపాడు మండలంలోని పడమటనర్సాపురంలో వన దేవతల జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సమ్మక్క- సారలమ్మ జాతర కార్యక్రమం జరుగనుంది. ఇప్పటికే ప్రాంగణాన్ని, గద్దెలను సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దారు. గత పదేహేనేళ్ల నుంచి రెండేళ్లకొకసారి అమ్మవారుల జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా 8వ సారి నిర్వహించే జాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు, సూర్యాపేట, మహబూబ్‌బాద్, నల్గొండ జిల్లాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తులు జాతరలో పాల్గొని అమ్మ వారులను దర్శించుకొని మొక్కులను చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండడంతో వారికి అసౌకర్యం కలుగకుండా నిర్వాహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు జాతర కార్యక్రమం సందర్భంగా పడ మటనర్సాపురం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొననుంది. ఇప్పటికే ప్రాంగణంలో దుకాణాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

14వ తేదీన ఉదయం 10 గంటలకు కమిటీ సభ్యులు గద్దెల వద్దకు పుట్టబంగారాన్ని తీసుకొచ్చి జాతరను ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం సారలమ్మ అమ్మ వారిని వనం నుంచి తీసుకొని వచ్చి గద్దె మీద ప్రతిష్ఠించనున్నారు. 15వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు వన మహోత్సవానికి వెళ్లి సాయంత్రం 5 గంటలకు సమ్మక్క అమ్మ వారిని తీసుకొచ్చి గద్దె మీద ప్రతిష్ఠించనున్నారు. 16వ తేదీన అమ్మ వారులను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకునే విధంగా ఏర్పాటు చేశారు. అనంతరం 17వ తేదీన తిరిగి అమ్మవారులను వనంలోకి పంపుతారు.

భక్తుల కొంగుబంగారం వనదేవతలు
కట్రం నరసింహారావు, పడమటనర్సాపురం, ఆలయ పూజారి



భక్తులు కోరిన కోర్కెలు తీర్చడంలో వన దేవతలైన సమ్మక్క - సారలమ్మలకు మహిమ శక్తులు కలవని భక్తులు అపారంగా నమ్ముతారు. గత 15 ఏళ్లుగా వన దేవతల జాతర కార్యక్రమానికి పూజారిగా ఉంటూ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తుండడంతో ఏనాడో చేసుకున్న పుణ్యమే. దేవతల పాదాల చెంత సేవ చేసుకునే భాగ్యం కలుగడం అదృష్టంగా భావిస్తున్నాను. వేలాది మంది భక్తులు ఈ జాతరలో పాల్గొంటారు.

నేటి నుంచి డెమో రైళ్ల పునరుద్ధరణ

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 12: ఖాజీపేట, డోర్నకల్, విజయవాడ, భద్రాచలం రోడ్ మీదుగా నడిచే డెమో రైళ్లను ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఖాజీపేట నుంచి డోర్నకల్(07753), డోర్నకల్ నుంచి ఖాజీపేట(07754), డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్(07755) రైలు 9.18గంటలకు, భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్(07756) రైలు రాత్రి 8.19కి, భద్రాచలం రోడ్ నుంచి విజయవాడ(07278) రైలు మధ్యాహ్నం 3.51కి, విజయవాడ నుంచి భద్రాచలం రోడ్(07979) ఉదయం 10.03కు బయళదేరనున్నాయి.

అంగన్‌వాడీని సందర్శించిన భాషా శాస్త్రవేత్తలు



పుస్తకాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 12: మండలంలోని తోగ్గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మైసూరు సీఐఐఎల్(సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) కేంద్రానికి చెందిన భాషా శాస్త్రవేత్తలు, కోయ భాష నిపుణులు సోమవారం సందర్శించారు. సీఐఐఎల్, ఎన్‌సీఈఆర్‌టీ సంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన కోయభాష వర్ణమాల పుస్తకాలపై విద్యార్థుల ప్రతిస్పందనను తెలుసుకున్నారు. కోయభాష నిపుణులైన పీసోడి కన్నయ్య, పాయం వెంకటరత్నం ఆధ్వర్యంలో కోయభాషలో రచించిన పుస్తకాన్ని చిన్నారులకు చూపించి వాటి పేర్లు చెప్పించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాష శాస్త్రవేత్తలు ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్, దూపుకుంట్ల రమేష్ భూషణ్, హెచ్ఎం బి. రవి, అంగన్‌వాడీ టీచర్ జానకి పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం చూపేది సైన్స్

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగించండి: డీఈవో వెంకటేశ్వరచారి





బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో, హాజరైన విద్యార్థులు

కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సమస్యకు పరిష్కారం చూపేది సైన్స్ అని, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగినప్పుడే పర్యావరణానికి రక్షణ కలుగుతుందని డీఈవో ఎం. వెంకటేశ్వరచారి అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ పోటీలు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పరిసరాలపై విద్యార్థులకు అవగాహన, పరిశీలన, ఆసక్తి కలిగించే విధంగా ప్రేరేపించాలన్నారు. జిల్లాస్థాయిలో మొదటి మూడు స్థానాలు గెలుచుకున్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. టీఎస్‌కాస్ట్ హైదరాబాద్ నుంచి జిల్లా పరిశీలకులుగా వచ్చి వి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈ నెల 28వ తేదీ సైన్స్‌డే సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ కోఆర్డినేటరు బి. సంపత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు, ఎస్. వెంకటేశ్వర్లు, న్యాయనిర్ణేతలుగా మధు, కళ్యాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

పాటల పోటీలు: వి.సంతోష్ (జడ్పీఎస్ చంద్రుగొండ), డి. రిషికా (జీహెచ్ఎస్. టేకులపల్లి), సీహెచ్. తేజస్విని (నవభారత్ హైస్కూల్, పాల్వంచ), ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.

పెయింటింగ్: బి. రేవంత్ (జిల్లా పరిషత్ అశ్వాపురం), ఉర్వశి (ఎక్సలెంట్ స్కూల్, మణుగూరు, జే. అభిమన్య (సింగరేణి హైస్కూల్, కొత్తగూడెం,)

కవిత్వం: సీహెచ్. హరీంద్రనాధ్, వార్షేయ (జీపీహెచ్ఎస్) జూలూరుపాడు, డి. యశస్విని (ఎక్సలెంట్ స్కూల్, బయ్యారం), జే. సాహితి (జీహెచ్ఎస్. పాత కొత్తగూడెం)

ఉపన్యాసం:పి. వేణు (ఎక్సలెంట్ మణుగూరు, ఆర్. షారోన్ (సింగరేణి స్కూల్, కొత్తగూడెం, ఎస్‌కే. రీహనా (త్రివేణి స్కూల్, కొత్తగూడెం),

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రణీత



ప్రణీత

సత్తుపల్లిరూరల్ ఫిబ్రరి12: గతనెలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డుకు సత్తుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మారుతి ప్రణీత ఎంపికైంది. ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో 109మంది విద్యార్థులు పోటీ పడగా 10మంది ఎంపిక కాగా వారిలో ప్రణీత ఉన్నట్లు హెచ్ఎం నాగేశ్వరరావు తెలిపారు. మహిళలకు ఆపద ఎదురైనప్పుడు తమను తాము ఎలా రక్షించుకునే పరికరాన్ని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు భద్రయ్య సహకారంతో ఆమె తయారు చేసింది.

22వ తేదీ నుంచి సహస్ర కలశాభిషేక మహోత్సవాలు

- 23, 24 తేదీల్లో నిత్యకల్యాణాల నిలిపివేత

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సహస్ర కలశాభిషేక మహోత్సవాలు ఈ నెల 22న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం మాఘమాసంలో సహస్ర కలశాభిషేక మహోత్సవాలు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు.

ఈ క్రమంలో 22న రామాలయంలో అంకురార్పణ, దీక్ష వస్త్రాల అందజేత తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పవిత్ర గోదావరి నుంచి తీర్థ బిందెను తీసుకురానున్నారు. 23న సహస్ర కలశావాహన, 24న సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో 23, 24 తేదీల్లో జరిగే నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లపై ఆర్డీవోకు ఫిర్యాదు

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 12: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై బీఆర్ఎస్ ఇచ్చిన అవిశ్వాస సమావేశ తీర్మానానికి గైర్హాజరైన ఐదుగురు కౌన్సిలర్లపై కొత్తగూడెం ఆర్డీవోకు విప్ జారీ చేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఫిర్యాదు చేశారు. ఈ నెల 5న ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం జరగగా ఈ సమావేశానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఐదుగురు విప్‌ను ధిక్కరించి హాజరుకాలేదు. ఐదుగురిలో నలుగురు కౌన్సిలర్లు గతంలోనే కాంగ్రెస్‌లో చేరగా ఒక్క కౌన్సిలర్ మాత్రమే బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ఐతే ఈ ఐదుగురు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున ఎన్నికయ్యారు. ఇతర పార్టీల్లో వెళ్లినా బీఆర్ఎస్ బీ ఫామ్ ద్వారా ఎన్నిక కావడంతో విప్ వర్తిస్తుందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. గైర్హాజరైన చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, వైస్‌చైర్మన్ జానీపాష, ఒకటవ వార్డు కౌన్సిలర్ వార రవి, 20వ వార్డు కౌన్సిలర్ మోగిలి లక్ష్మి, 22వ వార్డు కౌన్సిలర్ అంకేపాక నవీన్‌లు విప్ దిక్కరించినందున పదవి నుంచి తొలగించాలని ఆర్డీవో శిరీషకు హరిప్రియ ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై హైకోర్టులో సైతం రిట్ దాఖలు చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి.

మూవీ, టీవీ ఆర్టిస్టు ఎన్నికల్లో శ్రీనివాస్ విక్టరీ



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సినీనటుడు పృథ్వీరాజ్

బోనకల్, ఫిబ్రవరి 12: తెలంగాణా మూవీ, టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికల్లో సినీ నటుడు పృథ్వీరాజ్ ప్యానల్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన బోనకల్ వాసి శ్రీనివాస్ రాథోడ్ ఘన విజయం సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ఫలితాలను సోమవారం ప్రకటించారు. 1200 మంది సభ్యులుగా ఉన్న యూనియన్‌లో 757 ఓట్లు ఉండగా 513 ఓట్లు పోలయ్యాయి. తన సమీప ప్రత్యర్థి పై 244 ఓట్ల మెజార్టీతో గెలిపించినందుకు సభ్యులకు రుణపడి ఉంటానని శ్రీనివాస్ రాథోడ్ తెలిపారు. ఆయనను సినీ నటుడు పృథ్వీరాజ్‌తో పాటు పలువురు నటులు, బోనకల్ మండల మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు చిట్టుమోదు నాగేశ్వరావు, బాణోతు కొండ, కలవల లక్ష్మీనారాయణ, రంగా జనార్ధన్, మదన్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. ఆర్టిస్ట్ యూనియన్ బలోపేతం కొరకు కృషి చేస్తానని తనకు పదవి బాధ్యతను పెంచిందని శ్రీనివాస్ రాథోడ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

భక్తులకు అందుబాటులో ఈ-టికెట్

- ప్రారంభించిన భద్రాద్రి ఈవో రమాదేవి



'ఈ-టికెట్' సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఈవో

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ-టికెట్ సౌకర్యాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. సోమవారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆలయ ప్రాంగణంలోని ప్రధాన టికెట్ కౌంటర్లో ఈ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఇంతకాలం ముద్రించిన టికెట్లను అమ్మగా సోమవారం నుంచి ఈ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా పారదర్శకతకు అవకాశం ఉంటుందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు గీతాహర్షిణి



గీతాహర్షిణిని అభినందిస్తున్న ప్రతీక్‌జైన్

దమ్మపేట, ఫిబ్రవరి, 12: అంకంపాలెం గిరిజన గురుకుల పాఠశాలకు విద్యార్థిని రవ్వా గీతాహర్షిణి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. కాగా గీతాహర్షిణిని భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ప్రతీక్‌జైన్ సోమవారం అభినందించారు. జాతీయస్థాయిలో రాణించి బంగారం పతకం సాధించాలని ఆకాంక్షించారు. గీతావర్షిణి అంకంపాలెం గిరిజన గురుకుల పాఠశాలలలో 9వతరగతి చదువుతోంది. అండర్ 15లో ఈనెల 6,7 తేదీలలో హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. గీతాహర్షిణి ఈనెల 26 నుంచి మార్చి వరకు పాటియాలా, పంజాబ్‌లో జరిగే రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమెను డీడీ మణెమ్మ, ఏపీవో డేవిడ్‌రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, పీఈటీ రవి, హెచ్ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

స్త్రీనిధి సొమ్ము రికవరీ

కామేపల్లి, ఫిబ్రవరి 12: పండితాపురంలో 'గ్రామ దీపికల మాయ' అనే శీర్షికతో ఫిబ్రవరి 10న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏపీఎం సురేందర్‌బాబు పండితాపురం గ్రామంలో క్షేత్రస్థాయికి వెళ్లి వీవోలు మంజుల, ముత్తమ్మతో మాట్లాడారు. వారు వాడుకున్న స్రీనిధి డబ్బును సోమవారం రికవరీ చేసి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. మంజుల వద్ద నుంచి రూ.లక్షా20వేలు, ముత్తమ్మ వద్ద నుంచి రూ.77వేలను రికవరీ చేశారు. దీంతో డ్వాక్రా మహిళలు ఊపిరి పిల్చుకున్నారు. డ్వాక్ర మహిళలు ఏపీఎం సురేందర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండ సభకు తరలండి: ఎంపీ నామా



ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి12: కృష్ణానదీజలాలపై తెలంగాణా హక్కులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీఎత్తున తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత వైఖరి కృష్ణాబేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతుల సాగునీటి హక్కులపై గొడ్డలిపెట్టని నామా పేర్కొన్నారు. మన నీళ్లు, మన హక్కులకోసం కేసీఆర్ నాయకత్వంలో కలిసి పోరాడేందుకు నల్లగొండ సభకు భారీగా తరలిరావాలని కోరారు.

దుర్గాచారికి సాహిత్య సదస్సులో సన్మానం



దుర్గాచారిని సన్మానిస్తున్న దశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలానికి చెందిన ప్రముఖ కవి తాతోలు దుర్గాచారికి కొయ్యలగూడెంలో జరిగిన జాతీయ తెలుగు సాహిత్య సదస్సులో ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ కవిత్వం, విప్లవం అభ్యుదయ దృక్పథం అనే అంశంపై పత్ర సమర్పణ చేసినందుకు గాను ఈ సత్కారం చేసినట్లు సంస్థ నిర్వాహకులు, సాహితీవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, జి శంకర్‌రావు, సోంపాక సీత, ఆర్టీసీ డిపో మేనేజరు వి.రామారావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 12: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, ఆశ్రమాలు, గురుకులాల్లో చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ ఆఫీసర్ల సమక్షంలో వివిధ మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి సంబంధిత ప్రత్యేక అధికార్లు వారికి కేటాయించిన పాఠశాలలకు తప్పనిసరిగా సందర్శించాలని అన్నారు. గిరిజన విద్యపై అధికారులతో ప్రత్యే సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు డేవిడ్‌రాజు, తానాజీ, వెంకటేశ్వరరాజు, ఏపీవో పవర్ మునీర్‌పాష, జీసీసీ డీఎం సుగుణ పాల్గొన్నారు.

వైరా గురుకులంలో దగ్గు, జలువు

- అనారోగ్యంతో వచ్చిన ఇద్దరు విద్యార్థినులు
- మెడికల్ సర్టిఫికెట్ లేకపోవడంతో అనుమతి నిరాకరణ
- ఆందోళన అవసరం లేదు: ప్రిన్సిపాల్



వైరా, ఫిబ్రవరి 12: వైరా మండలంలోని ముసలిమడుగు గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలోని కొంతమంది విద్యార్థులు జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. ఈ గురుకులంలోని ఇద్దరు విద్యార్థినులు క్షయవ్యాధి లక్షణాలతో గత ఏడాది దసరా పండుగ నుంచి హోం ఐసోలేషన్‌లోనే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. ఆరునెలల కోర్సుకు మందులు వాడుతున్నారు. ఈ తరుణంలోనే పాఠశాలలోని కొద్దిమంది విద్యార్థినులకు జలుబు, దగ్గు లక్షణాలు కన్పించడంతో ఆందోళన మొదలైంది.

ప్రతీవారం ఇక్కడ విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జలుబు, దగ్గు వాతావరణ మార్పులకు సంబంధించి సాధారణంగా జరిగే ప్రక్రియగానే యాజమాన్యం భావిస్తోంది. క్షయ వ్యాధి లక్షణాలతో హోంఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల్లో ఒకరు రెండురోజుల కిందట గురుకులానికి వచ్చిన సమయంలో డాక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రం కావాలని గురుకుల యాజమాన్యం స్పష్టం చేసింది. ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఆ విద్యార్థినిని తిరిగి వెనక్కి పంపించివేశారు. ఈ సమయంలోనే కొద్దిమంది విద్యార్థులకు జలుబు, దగ్గు ఉండటంతో కలకలం మొదలైంది.

దసరా నుంచే హోం ఐసోలేషన్
ప్రిన్సిపాల్ సుఖభోగి



గురుకుల పాఠశాలలో విద్యార్థులు దగ్గు, జలుబుతో బాధపడుతున్న విషయంపై ప్రిన్సిపాల్ సుఖభోగి నాగేంద్రమ్మను వివరణ కోరగా విద్యార్థినులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న ఇద్దరు విద్యార్థినులు దసరా నుంచే హోంఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని, ఇప్పుడు పాఠశాలలో విద్యార్థినులకు జలుబు, దగ్గులు సాధారణంగా వచ్చినవేనని పేర్కొన్నారు. నిరంతరం వైద్యపరీక్షలు చేయిస్తున్నామని, విద్యార్థినులు కానీ వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

మంగళవారం 13 ఫిబ్రవరి 2024

8

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

పద్మశ్రీ గ్రహీత రామచంద్రయ్యకు సన్మానం

మణుగూరు, ఫిబ్రవరి 12 : మణుగూరు మండల పరిధిలోని కూనవరం గ్రామానికి చెందిన పద్మ శ్రీ సకిని రామచంద్రయ్యను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ సన్మానించారు. రామచంద్రయ్య యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, నాయకులు పున్నం భిక్షపతి, లింగంపల్లి రమేష్, అరవింద్ బాలు, ముత్యాల వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు చిర్ర సరస్వతి, యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు కొమ్ము వంశి, వెంకన్న, బోగే చందర్‌రావు పాల్గొన్నారు.



రామచంద్రయ్యను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలతో కాకర్ల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది

జూలూరుపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన చిన్నజీయార్ స్వామి శిష్యులు సౌమిత్రి శ్రీధరచార్యులు - శ్రీవాణి దంపతులు వారి కుమారుడు శ్రీకమల్ జ్ఞాపకార్థంగా గ్రామంలోని ఉన్నత పాఠశాలకు 30 వేల విలువ చేసే 50 కుర్చీలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సంజీవరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకుడు మిర్యాల రమేష్ సహకారంతో పాఠశాలకు దాత కుర్చీలను అందించారని తెలిపారు. కుర్చీలను అందించిన దాతను ఆయన అభినందించారు. పాఠశాల అభివృద్ధికి మరింతమంది దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, శంకర్, కె.శ్రీనివాసరావు, కాజామియా, రాణి, మిర్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సుదర్శన క్రియ శిక్షణా కార్యక్రమం

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలంలోని సీపీఎం ఆఫీసు సమీపంలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్వాస ప్రక్రియ సుదర్శన క్రియనుపై ఆరు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పి.వెంకట్‌జీ తెలిపారు. ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు ప్రతి రోజు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కోర్సు వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు ఒత్తిడి, భయం లేని జీవితం, శారీరక ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. శిక్షణకు వచ్చే వరాఉ నేల మీద కూర్చోలేని వారు కుర్చీలో కూర్చొని చేయవచ్చుని తెలిపారు. వివరాలకు 9948970017, 9912995459 లో సంప్రదించాలని కోరారు.

అటవీ జంతువుల కోసం

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

» ఎస్పీ రోహిత్‌రాజ్





అన్నపురెడ్డిపల్లిలో మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ రహమాన్, మణుగూరు సీఐ రమాకాంత్

కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువులను వేటాడటానికి ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆయన మాట్లాడారు.. అడవి జంతువులను వేటాడే వేటగాళ్లు కరెంటు తీగలను అమర్చటం వల్ల పంట పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందుతున్నారని అన్నారు. చాలా మంది అమాయకులు అడవి జంతువులకై అమర్చిన విద్యుత్ తీగలకు తాకి మృతి చెందిన ఘటనలు ఉ న్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కా కుండా సంబంధిత అధికారులు చూసుకోవాలని సూచించారు. భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్ ఆపరేషన్లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఆఫీసర్ అడవిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కరెంట్ తీగలకు తగిలి ప్రాణాలను కోల్పోవటం బాధాకరమని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.. అడవిలో ఎవరైనా అక్రమంగా విద్యుత్తు తీగలు అమర్చితే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



అటవీ జంతువులను వేటాడొద్దు: డీఎస్పీ

●కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: అడవి జంతువులను వేటాడే క్రమంలో విద్యుత్ తీగలను వలయాలుగా ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలనుసారం డివిజన్ పోలీస్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలలో అడవి జంతువులను వేటాడం నేరమని తెలిపారు. ముఖ్యంగా కొత్తగూడెం పోలీస్ డివిజన్ పరిధిలో గల చుంచుపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్ , లక్ష్మీదేవిపల్లి మండలాలలో అడవి జంతువులను వేటాడడం సర్వసాధరణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాలలో జంతువులను వేటాడనీయబోమని, స్థానిక గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల నుంచి లిఖిత పూర్వకంగా లేఖలను స్వీకరించామని తెలిపారు. ప్రస్తుతం ఎవరైన జంతువులను వేటాడితే గ్రామాలలోని ప్రజా ప్రతినిధులను బాధ్యులుగా చేస్తామని, ఎటువంటి సమాచారం ఉన్నా పోలీస్ శాఖకు తెలపాలని కోరారు.

●అన్నపురెడ్డిపల్లి: అటవి జంతువులను వేటాడడానికి వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాదు, ఎస్ఐ షాహీనా, విద్యుత్ శాఖ ఏఈ, వైస్ ఎంపీపీ రామారావు, మండలంలోని పెద్దలు పర్సా వెంకటేశ్వరరావు, దుబాకుల రాము, వీరబోయిన నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

●జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడేందుకు ఎవరైన అటవీ ప్రాంతాలలో విద్యుత్ వైర్లను అమర్చినట్లు అయితే చర్యలు తప్పవని జూలూరుపాడు ఎస్ఐ ఇరుగు జీవన్‌రాజు తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

●మణుగూరుటౌన్: మణుగూరు మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జంతువుల కోసం విద్యుత్ తీగలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమాకాంత్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్ ఆపరేషన్‌లో బాగంగా విధుల నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడం బాధాకరమన్నారు. ఎవరైన ఇలా జంతువుల కోసం అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చిన విషయం తెలిసిన వారు తమకు సమాచారమివ్వాలని కోరారు.

ఏపీఎంకు సమ్మె నోటీసు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 12: ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్‌బంద్‌లో తామంతా పాల్గొంటామని తెలుపుతూ తెలంగాణా ఐకేపీ వీవోఏల సంఘం ఐకేపీ ఏపీఎం హేమంతినికు సోమవారం సమ్మె నోటీసునందజేశారు. కేంద్రంలోని బీజేపీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని సీఐటీయూ జిల్లా కోశాధికారి జిపద్మ, వీఓఏల సంఘం జిల్లా నాయకులు వెంకటేష్‌లు విమర్శించారు. నాయకులు కృష్ణవేణి, కుమారి, అరుణ, నాగవేణి, శ్యామ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యపట్టణ అధ్యక్షుడిగా అర్వపల్లి



ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 12: ఆర్య వైశ్య సంఘం ఇల్లెందు పట్టణ నూతన అధ్యక్షుడిగా అర్వపల్లి రాధ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమీటిని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడికి నలుగురు పోటీ పడగా, సీనియర్ అయిన అ ర్వపల్లి రాధకృష్ణను ఏకాభిప్రాయం తో ఎన్నుకున్నారు. ఆ యన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈసమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

నల్గొండ సభను విజయవంతం చేయాలి

భద్రాచలం, ఫిబ్రవరి 12: కృష్ణా జలాల పరిరక్షణకు మంగళవారం నల్గొండలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు ఆకోజు సునీల్‌కుమార్ అన్నారు. భద్రాచలంలో సోమవారం జరిగిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మళ్లీ నీళ్ల పోరాటం మొదలైందని కృష్ణా జలాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోటగిరి ప్రబోద్‌కుమార్, గుంజ ఏడుకొండలు, బత్తుల నరసింహులు, విశ్వనాధ్ పాల్గొన్నారు.

'విశ్వకర్మ' యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



జ్యోతి ప్రజల్వన చేస్తున్న అధికారులు..

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12: ప్రధానమంత్రి 'విశ్వకర్మ' యోజన పథకాన్ని లబ్దిదారులు వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన నిరుద్యోగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కుమ్మరి, వడ్రంగి, మంగలి, రజక, వడ్డెర, కంసాలి, దర్జీ, కంసాలీ, వంటి చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారంతా ఈ పథకం ఆర్థిక సహాయానికి అర్హులని అన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, రేషన్ కార్డుతో ఆన్లైన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సీతారాం, లీడ్ బ్యాంకుమేనేజర్ రామ్‌రెడ్డి, పీఎం విశ్వకర్మ యోజన స్టీరింగ్ సభ్యులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల శ్రమ వృథా కావొద్దు

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 12: పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కోసం పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని, వారి శ్రమను వృథాకావద్దని, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు బాధ్యతతో తడిపొడి చెత్తలను వేరుగా స్వచ్ఛఆటోలకే ఇవ్వాలని కోరారు. చెత్తను, ప్లాస్టిక్ బాటిల్‌ను బుగ్గవాగులో వేయడం ద్వారా ఎక్కడిక్కడే ఆగిపోయి దుర్గంధం వస్తుందన్నారు. కాలువల్లో దిగి చెత్తచెదారం తొలగించేందుకు మున్సిపల్ కార్మికులు, ఎంత శ్రమించాలో ఆలోచించాలని కోరారు. బుగ్గవాగుల్లోకి చెత్త, ప్లాస్టిక్ వస్తువులు వెల్లకుండా ప్రధాన డ్రైనేజిలకు ఫేన్సింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ మేనేజర్ అంకుషావళి, శానిటర్ ఇన్‌స్పెక్టర్ రాధకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీను, జవాన్లు అంజద్, ప్రకాశ్, లక్ష్మణ్, కళ్యాన్ తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌చైర్మన్, అధికారులు

చిరంజీవిని కలిసిన అభిమాన సంఘం నాయకుడు

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 12: ప్రముఖ సినీ హీరో చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషన్ అవార్డును ప్రకటించడం పట్ల చిరంజీవి అభిమాన సంఘం పాల్వంచ అద్యక్షుడు ఖాసీం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాదులో చిరంజీవి బ్లడ్ బ్యాంకు నందు చిరంజీవిని కలిసి అభినందించి భద్రాద్రి సీతారామచంద్రస్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఖాసీం మాట్లాడుతూ భవిష్యత్తులో చిరంజీవికి భారతరత్న అవార్డు కూడా రావాలని ఆకాంక్షించారు.



జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు, టేకులపల్లి సీఐల బాధ్యతల స్వీకరణ



ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు/టేకులపల్లి, ఫిబ్రవరి 12: జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆలేటి ఇంద్రసేనారెడ్డి సోమవారం బాద్యతలను స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్ భద్రాద్రి జిల్లా డీసీఆర్బీకి బదిలీపై వెళ్ళారు. అయన స్థానంలో టేకులపల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న ఇంద్ర సేనారెడ్డి బదిలీపై జూలూరుపాడు సీఐగా వచ్చారు. ఆయనకు జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డి పల్లి ఎస్ఐలు ఇరుగు జీవన్‌రాజు, రవి, షాహీన, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఎవరైన వ్యక్తులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు.

టేకులపల్లి సీఐగా సురేష్..



టేకులపల్లి సీఐ సురేష్

టేకులపల్లి టేకులపల్లి పోలీసు సీఐగా తాటిపాముల సురేష్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఇంద్రాసేనారెడ్డి జూలూరుపాడు సీఐగా బదిలీపై వెళ్లారు. సీఐ సురేష్ ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగ సీఐ సురేష్ గతంలో టేకులపల్లి ఎస్ఐగా పనిచేసిన కాలంలో మండల ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణకోసం నిరంతరం పనిచేస్తామని, అసాంఘిక కార్యకలపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లె పల్లెకు పోదాం' పదండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్

కరకగూడెం, ఫిబ్రవరి 12: బీజేపీ ఆధ్వర్యంలో 'గావ్ చలో' అబియాన్ కార్యక్రమంలో భాగంగా పల్లె పల్లెకు పోదాం పదండి కార్యక్రమంను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల అయిలయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరాం చంద్రయ్య, మండల అధ్యక్షులు గంగనపల్లి నాగేశ్వరావు, కొమ్ము వంశీ, పున్నం బిక్షపతి, దంతులూరి రామచంద్రయ్య, దూలిపూడి శివప్రసాద్, గోగు అనిల్, పాయం లక్ష్మీనారాయణ, రాజు, రజీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ డే పోటీల్లో ఎక్సలెంట్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు తీసుకుంటున్న విద్యార్థులు

మణుగూరు, ఫిబ్రవరి 12: జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన సైన్స్ డే పోటీల్లో మణుగూరు ఎక్సలెంట్ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎక్సలెంట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎండీ యూసఫ్ విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాన్యాస పోటీల్లో 7వ తరగతి విద్యార్థి పీ వేణు ప్రథమ స్థానం, కవిత్వ పోటీల్లో డీ యశస్విని ద్వితియ స్థానం, పెయింటింగ్ పోటీల్లో ఉర్వశీ ద్వితీయ స్థానంలో నిలిచి తమ ప్రతిభను చాటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 28న హదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా విద్యాధికారి ఎం వెంకటేవ్వరచారీ, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతి, రాష్ట్ర టీఎస్ కాస్ట్ పరిశీలకు వి వెంకటేశ్వరరావులు విద్యార్థులను అభినందించారన్నారు.

మినీ మేడారం జాతరకు ఆహ్వానాలు

» అధికారులతోపాటు సింగరేణి జీఎంకు ఆహ్వానాలు

» జాతర 4 రోజులపాటు సహకరించాలని వినతి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 12: మణుగూరు మండలంలో మినీ మేడారంగా విరాజిల్లుతోన్న తోగ్గూడెం సమ్మక్క-సారాలమ్మల దేవాలయంలో జాతర సందడి మొదలైంది. ఈ నెల 21 నుంచి 24వరకు నిర్వహించే జాతరను విజయవంతం చేయాలని ప్రభుత్వ అధికారులను, సింగరేణి జీఎంను ఆలయ కమిటీ చైర్మన్ ఊకే వీరయ్య, మాజీ సర్పంచ్ బొగ్గం రజితలతో పాటు, ఆలయ పూజారి పర్సిక రాజమ్మ, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం జాతరకు ఆహ్వానించారు. ఇందులో బాగంగా ఎస్‌డీపీఓ రాఘవేందర్‌రావు, సీఐ రమాకాంత్‌లకు ఆహ్వానం పలికి జాతర సమయంలో ఎటువంటి అవాంచానీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని కోరారు. ఏరియా జీఎం దుర్గం రామ్‌చందర్, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళిలతో అటవీ అధికారులను, ఇతర ప్రభుత్వ అధికారులను ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ వైస్ ఛైర్మన్ బొగ్గం రాజు, సభ్యులు కొమరం సైదులు, పిసోడి పుల్లారావు, పులిమాద్రి వీరభద్రం, బోడిక నరేష్, మడకం శ్రీనివాస్, కొమరం నిర్మల, గొర్రె కాంతమ్మ, పాక సరిత, మడకం గోపమ్మ, మిడియం తిరుపతమ్మ, ఊకే మంగమ్మ, గ్రామ పెద్దలు తదితరులు తహశిల్దార్ రాఘవరెడ్డిని రెవెన్యూ కార్యాలయంలో కలసీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర సమయంలో ఎటువంటి ఆవాంచానీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు, తీసుకోవాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.



తహసీల్దార్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీస్

» డీసీవోకు వినతిపత్రం అందజేసిన డైరెక్టర్లు

ఇల్లెందురూరల్,ఫిబ్రవరి12: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇల్లెందు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బండారి శ్రీనివాస్‌పై అవిశ్వాస నోటిస్ జారీ చేయాలని పీఏసీఎస్ చైర్మన్ ఆధ్వర్యంలో 9మంది డైరెక్టర్లు సోమవారం డీసీఓను కలిశారు. ఇల్లెందు పీఏసీఎస్ పరిధిలో 13 మంది డైరెక్టర్‌లు ఉండగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిక స్థానలు సాదించి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకుంది. ఇటివల జరిగిన రాజకీయ పరిణామాలతో చైర్మన్ మెట్ల కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ చెందిన డైరెక్టర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. దీనితో బీఆర్ఎస్‌లో ఉన్న బండారి శ్రీనివాస్‌ను వైస్ చైర్మన్ నుంచి తప్పించేందుకు మెజారిటీ డైరెక్టర్‌లు సుముఖంగా ఉండడంతో సోమవారం కొత్తగూడెం డీసీఓ వెంకటేశ్వర్లును కలిసి నోటీస్ అందించారు.

బదిలీ ఎంపీడీవోలకు ఘన సన్మానం





బూర్గపాడు, ఆళ్లపల్లి ఎంపీడీవోలు వివేక్‌రామ్, రామారావును సన్మానిస్తున్న దృశ్యం

బూర్గంపాడు/ఆళ్లపల్లి, ఫిబ్రవరి 12: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తోన్న వివేక్‌రామ్‌ను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా హజరై సన్మాన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, యూడీసీ రఘు, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సేవ చేయడం ఆనందంగా ఉంది

ఆళ్లపల్లి : ఆళ్లపల్లి నూతన మండలంలో మొదటి సారిగా సేవ చేయడం చాలా సంతోషంగా ఉన్నపట్టికి తక్కువ సమయంలో సేవ చేసి బదిలీపై వెళ్లడం భాదకరంగా ఉందని ఆళ్లపల్లి ఎంపీడీవో ఏం. రామారావు అన్నారు. సోమవారం ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాయంలో ఆళ్ల పల్లి ఎంపీడీవో రామారావు మహబూబబాద్‌కు బదిలీ అవ్వడంతో ఆళ్లపల్లి ఎంపీపీ మంజుభార్గవి, జడ్పీటీసీ హనుమంతరావు, వైస్ఎంపీపీ రేసు ఎల్లయ్య, కోఆప్షన్ సభ్యులు రహీం, ఏంపీవో శ్రీనివాస్, ఏపీవో రంగనాథ్, ఏపీఎం రామ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ రేవంత్, ఉపాధి హామీ పథకం అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు వీడ్కోలు పలికి, శాలువాలతో సన్మానించారు.

ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

» అదనపు కలెక్టర్ రాంబాబు

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి 12: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. సోమవారం ఐడివోసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బాధితులు దరఖాస్తులు అందజేశారు. అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాకాని దుర్గ తన భర్త గత ఏడాది డిసెంబరు 16న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, తను అంగ వైకల్యంతో బాధపడుతున్నానని తనకు ఉపాధి కల్పించాలని కోరారు. లక్ష్మిదేవిపల్లి మండలంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన కూరపాటి ఉపేంద్ర తన భర్త వెంకన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడని, తన కుమార్తె బుద్ధి మాంద్యంతో బాధ పడుతున్నారని, తనకు దివ్యాంగురాలుగా గుర్తింపు కార్డు ఉన్నా తనకు పింఛన్ రావడం లేదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కారం చూపాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీఆర్‌డీవో రవీంద్రనాద్, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు



హాజరైన అధికారులు

ఎమ్మెల్యే పాయం కృషితో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్లకు శంకుస్థాపన

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 12: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో నేడు ఆళ్లపల్లి మండలంలోని పలు సీసీ రోడ్లుకు మూహూర్తం కలిగిందని వైస్ఎంపీపీ రేసు ఎల్లయ్య ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనర్సయ్య అన్నారు. సోమవారం వారు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మూత్తాపురం, ఆళ్లపల్లి(కొమ్ముగూడెం)లోని పలు అంతర్గత సీసీరోడ్లుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రహీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అతహార్, తులం ముత్తిలింగం, పడిగసమ్మయ్య, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి12: కనీస వేతనం, కార్మిక చట్టాల, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, సామాజిక భద్రత చట్టం అమలు కోసం ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొనడం ద్వారా దేశాన్ని రక్షించుకుందాం - ప్రధాన మోదీ గద్దె దింపుదామంటూ ప్రతిన బూనాలని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ అన్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల కార్మికులు సోమవారం కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావుకు సమ్మె నోటీసును అందించారు. కార్యక్రమంలో అద్దె బస్సుల డ్రైవర్స్ సంఘం నాయకులు కత్తి నరసింహా, సైదులు, రాజు, ప్రవీణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.